పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కిశోర్ పరామర్శ

వెంకటయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

శాలిగౌరారం, ఏప్రిల్ 12 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలు కుటుంబాలకు శనివారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పరామర్శించారు. మండలంలోని గురజాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాచకొండ గణేశ్ తండ్రి రామయ్య, అడ్లూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కడమంచి వెంకటయ్య కుమారుడు నవీన్‌కుమార్ ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల చిత్ర పటాలకు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీశ్‌రెడ్డి, కట్టా వెంకట్‌రెడ్డి, గుండా శ్రీనివాస్, మామిడి సర్వయ్య, గుజిలాల్ శేఖర్‌బాబు, చంద్రమౌలిగౌడ్, బోడ నర్సయ్య, అంబాల కృష్ణ, కమలాకర్, మాగి రవి, అంజయ్య, శ్రావణ్ ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశం

- ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

బీఆర్ఎస్ రజతోత్సవసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 12 : ఈ నెల 13న నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్‌లో జరిగే బీఆర్ఎస్ నియోజవర్గ సన్నాహక సమావేశానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని పార్టీ నల్లగొండ మండల అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే పార్టీ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. సన్నాహక సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు తరలిరావాలని పిలుపుచ్చారు. అనంతరం బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమాలలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బడుపుల శంకర్, నాయకులు పొగాకు ఘట్టయ్య, మామిడి సురేశ్, కమ్మంపాటి వెంకన్న, నగేశ్, పోలె శివాజీ,

మామిళ్ల సైదులు, బొల్లేపల్లి శంకర్, పొడిచేటి రవి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న జూలకంటి రంగారెడ్డి

కట్టంగూర్, ఏప్రిల్ 12 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సీపీఎం మండల నాయకులు పాదయాత్ర చేపట్టారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సీపీఎం నాయకులు చేపట్టిన పాదయాత్రను శనివారం ఆయన ఈదులూరు గ్రామంలో ప్రారంభించి మాట్లాడారు. మండలంలో ప్రజలు, రైతులు తాగు, సాగు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాల్వలు మరమ్మతులకు నోచుకోక ఎస్ఎల్‌బీసీ నుంచి వచ్చే నీరు రైతులకు అందడంలేదన్నారు. లిఫ్టులు, మేజర్ కాల్వలకు మరమ్మతులు చేస్తే 30వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, గంజి మురళీధర్, బొజ్జ చిన వెంకులు, రాచకొండ వెంకన్న, జిట్ట సరోజ, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, నాయకులు పాల్గొన్నారు.

శాలిగౌరారం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

- మానవహక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు వీరస్వామి

అంజయ్యను పరామర్శిస్తున్న వీరస్వామి

శాలిగౌరారం, ఏప్రిల్ 12 : శాలిగౌరారం ఎస్ఐ సైదులుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మానవహక్కుల వేదిక ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు అక్కెనపెల్లి వీరస్వామి డిమాండ్ చేశారు. నకిరేకల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న అంజయ్యను శనివారం మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో పరామర్శించారు. అతడితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ఎన్జీకొత్తపెల్లి గ్రామంలో ఇటీవల జరిగిన ఇంటి స్థలం పంచాయితీ విషయమై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన రాపోలు అంజయ్యపై పోలీసులు చేయి చేసుకున్నారని, బాధితుడు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వమే చికిత్స అందించాలని, అతడికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సంఘం నాయకులు అద్దంకి దశరథ, వెంకటరమణ, ఉదయ్‌కుమార్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాగరత్నం రాజు

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 12 : పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని దోమలపల్లి, అన్నెపర్తి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం గొల్లగూడ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో మౌళిక సదుపాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దేప వెంకట్‌రెడ్డి, హాశం, వెంకన్న, మందడి వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య, సీఈఓ అనంతరెడ్డి పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పొడిగించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, ఏప్రిల్ 12: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు గడువును ఈ నెల చివరి వరకు పొడిగించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. శనివారం మిర్యాలగూడలో విలేకరులతో మాట్లాడుతూ సర్వర్ డౌన్, సాంకేతిక కారణాలతో చాలా మంది యువకులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందలేకపోయారని పేర్కొన్నారు. వీటికి సంబంధించిన దరఖాస్తులు తాసీల్దార్ కార్యాలయాల్లో లక్షల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దానికి తోడు వరుసగా సెలవులు వచ్చినందున దరఖాస్తు గడువును పొడిగించాలని ఆయన కోరారు.

రైతుపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

మిర్యాలగూడ రూరల్,ఏప్రిల్12 : రైతు తన స్థలంలో గడ్డి వాము వేస్తుండడంతో దానికి అభ్యంతరం చెబుతూ పక్కింటి వ్యక్తి దాడి చేసిన ఘటన శనివారం యాద్గార్‌పల్లిలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన బొబ్బల వెంకటేశ్వర్లు తన పొలంలో వరి కోతల అనంతరం వచ్చిన గడ్డిని పశువుల మేతకోసం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా ఉన్న సొంతస్థలంలో పెట్టేందుకు తీసుకెళ్లాడు. దీనికి పక్కఇంటి యజమాని గడ్డివాము పెట్టవద్దంటూ నివారించాడు. ఈ విషయమై వాగ్వాదానికి పాల్పడంతో పాటు తనపై, తన కుమారుడిపై దాడిచేసి గాయపర్చినట్లు బాధితుడు వాపోయాడు. తనపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు విలేకరులకు తెలిపాడు.

సీసీ కెమెరాలు ప్రారంభం

నీలగిరి, ఏప్రిల్12 : నల్లగొండ పట్టణంలోని పాతబస్తీతో పాటు బ్రహ్మంగారి గుట్టపై 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా శనివారం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు శంకర్, సైదులు, నాయకులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

జిల్లాను వ్యవసాయ హబ్‌గా తీర్చి దిద్దాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- మఖానా ప్రయోగాత్మక సాగు ప్రారంభం

కంపసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో మఖానా విత్తనాలను చల్లుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

త్రిపురారం, ఏప్రిల్ 12: నల్లగొండ జిల్లాను వ్యవసాయ హబ్‌గా తీర్చి దిద్దాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం మండలంలోని కంపసాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మఖానా ప్రయోగాత్మక సాగును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వాతావరణం, నీటి వసతులు, కొత్త పంటల సాగును దృష్టిలో ఉంచుకొని ఆయా పంటల సాగులో రైతులను ప్రోత్సహించాలన్నారు. రైతులు ఒకే పంటను సాగు చేయడం వల్ల కరువు, తెగుళ్ల బారిన పడినప్పుడు తీవ్రంగా నష్టపోతారన్నారు. అలా కాకుండా ఉండాలంటే పంట మార్పిడి అవలంభించాలని సూచించారు. కొత్తరకం పంటల సాగును ప్రోత్సహించేందుకు ఇటీవల జిల్లా నుంచి నలుగురు శాస్త్రవేత్తలు, అధికారుల బృందాన్ని బిహార్ రాష్ట్రంలోని దర్భంగ మఖానా స్టేషన్‌కు పంపించినట్లు తెలిపారు. వారు అక్కడ అధ్యయనం చేసిన అంశాల ఆధారంగా జిల్లాలో ప్రయోగాత్మకంగా కంపసాగర్ వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో ఎకరం విస్తీర్ణంలో మఖానా సాగు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రెండుమూడు నెలల్లో విత్తనం ఒక ఎకరానికి సరిపడా నారును పెంచి క్షేత్రాన్ని పరిశీలించనున్నట్లు చెప్పారు. దాంతో పాటు కట్టంగూరు రైతు ఉత్పత్తి సంస్థ ఆధ్వర్యంలో మూడు ఎకరాల్లో, నకిరేకల్ నియోజకవర్గంలో రెండు ఎకరాల్లో, కొండమల్లేపల్లిలో నాలుగు ఎకరాల్లో మఖానా సాగు చేయనున్నట్లు తెలిపారు. ప్రయోగాత్మక సాగులో 60 శాతం పంట దిగుబడి వచ్చినా ఇక్కడే మఖానా ప్రాసిసెంగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ వ్యవసాయ అధికారులతో కలిసి కంపసాగర్ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని పంటలను పరిశీలించారు. మఖానా సాగు విత్తనాలను వ్యవసాయ క్షేత్రంలో చల్లారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, కంపసాగర్ వ్యవసాయ పరిశోధనా స్థానం హెడ్ ఎన్.లింగయ్య, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, ఎంపీడీఓ కునిరెడ్డి విజయకుమారి, హాలియా ఏడీఏ వెంకటరవీంద్ర, ఏఓ పార్వతీ చౌహాన్, నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాధర్ సేవలు ఎనలేనివి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్


గంగాధర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ, ఏప్రిల్ 12: స్వాతంత్ర్య సమరయోధుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరునగరు గంగాధర్ మిర్యాలగూడ ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం గంగాధర్ జయంతి సందర్భంగా పట్టణంలోని సాగర్‌రోడ్డులోగల ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలు లోడ్ చేస్తుండగా ప్రమాదం

- ముగ్గురు హమాలీలకు గాయాలు

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హమాలీలు

మిర్యాలగూడ(మాడ్గులపల్లి), ఏప్రిల్ 12: మాడ్గులపల్లి మండలం పాములపాడు గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో శనివారం ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు బస్తాలు కూలాయి. దాంతో ముగ్గురు హమాలీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాములపాడు గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో రైతుల ధాన్యాన్ని కాంటా వేసిన అనంతరం బస్తాలను హమాలీలు లారీలో లోడ్ చేస్తుండగా.. లారీలో పేర్చిన బస్తాలు కూలాయి. దాంతో హమామీలు గండమల్ల కృష్ణయ్య లారీ పైనుంచి కింద పడిపోగా.. కింద ఉన్న లింగయ్య, వెంకన్నపై బస్తాలు ఒక్కసారిగా పడడంతో ముగ్గురికి తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని తోటి హమాలీలు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వివాదాస్పదమవుతున్న అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు

మర్రిగూడ, ఏప్రిల్ 12 : మండలంలోని మేటిచందాపురంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు వివాదాలకు కారణమవుతున్నది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంగిలి రవి ఎస్సీ కాలనీ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గత నెలలో పనులు ప్రారంభించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఊరిపక్క నగేశ్ సహా గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు భూమిపూజ చేశారు. ఊరి చివరన కాకుండా ఊరి మధ్యలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించాలని ఈ నెల 4న పలువురు గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ నెల 11న తాసీల్దార్ బక్క శ్రీనివాస్, ఎస్ఐ కృష్ణారెడ్డి, ఎంపీఓ రవికుమార్ గ్రామంలో విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విగ్రహ నిర్మాణ పనులను నిలిపివేయాలని జంగిలి రవికి అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే వారి ఆదేశాలను బేఖాతరు చేస్తూ శుక్రవారం రాత్రి ఆయన అంబేద్కర్ విగ్రహాన్ని తెచ్చి దిమ్మెపై నిలబెట్టారు. అయితే కలెక్టర్ ఆదేశాలను ఉల్లంఘించి, గ్రామంలో శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు చేపడుతున్న విగ్రహ ఏర్పాటు పనులను నిలుపుదల చేయాలని కోరుతూ శనివారం ఎస్సీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు బీఆర్ఎస్ నాయకుడు ఊరిపక్క నగేశ్ విలేకరులకు తెలిపారు.

దళితులపట్ల వివక్షపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను

దళిత కాలనీలో సర్వే చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నిడమనూరు, ఏప్రిల్ 12 : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏండ్లు అవుతున్నా నేటికీ దళితులపై వివక్ష కొనసాగుతుందని, ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. శనివారం నిడమనూరు ఎస్సీ కాలనీలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ సర్వేలో విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయని తెలిపారు. నిడమనూరు శివాలయంలో అయ్యగారు దళితులను ఆలయంలోనికి రానివ్వడం లేదని, బయటనే కొబ్బరికాయ కొట్టమని చెబుతున్నారని, దళితుల ఇంట్లో పెండ్లి చేసేందుకు సైతం రావడం లేదని కాలనీవాసులు తమ దృష్టికి తెచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, మిర్యాలగూడ ఆర్డీఓ, డీఎస్పీ, తాసీల్దార్, ఎస్ఐ దృష్టికి తీసుకెళతామన్నారు. పెద్దవూర మండలంలోని సంగారం, ఊట్లపల్లి, తిరుమలగిరి సాగర్ మండలంలోని నెల్లికల్లు, గ్రామాల్లో సైతం ఇలాంటి వివక్ష ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు కొడిరెక్క మల్లయ్య, దైద శ్రీను, నాగార్జున, మేకల వెంకన్న, శివ, పుల్లయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా, ఏప్రిల్ 12 : అనుముల మండలం రామడుగు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తిమ్మాపురం 11 కేవీ అగ్రికల్చర్ విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్ల కొమ్మలను ఆదివారం తొలగించనుండడంతో ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ధన్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

త్రిపురారం మండలంలో..

త్రిపురారం : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ నుంచి ముకుందాపురం 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్‌కు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగిస్తుండడంతో ఆ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బాలు తెలిపారు.

సత్యనారాయణ కుటుంబానికి ఎమ్మెల్సీ కోటిరెడ్డి పరామర్శ

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 12: మండల కేంద్రానికి చెందిన బత్తుల సత్యనారాయణ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి సత్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు యాదవ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నాగెండ్ల వెంకట్‌రెడ్డి, పగడాల సైదులు యాదవ్, భాస్కర్, సురేశ్ ఉన్నారు.

పెంచిన వంట గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 12 : కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని దాసరిగూడెం గ్రామంలో జరిగిన వ్యవసాయ కూలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెగిరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం గ్యాస్ ధర పెరగడంతో పేదలపై మరింత భారం పడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు చెరుకు పెద్దులు, నాగరాజు, పద్మ, రాములు, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

గురుకుల పరీక్షలో రాజన్నగూడెం విద్యార్థి ప్రతిభ

సాత్విక్

నిడమనూరు, ఏప్రిల్ 12 : మండలంలోని రాజన్నగూడెం గ్రామానికి చెందిన మండలి సాత్విక్ గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 16వ, జిల్లా స్థాయిలో 2వ ర్యాంక్ సాధించాడు. రాజన్నగూడెం గ్రామానికి చెందిన మండలి సత్యనారాయణ, రామాంజమ్మ దంపతుల కుమారుడైన సాత్విక్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించడంపై పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని అభినందించారు.

కలర్ ల్యాబ్ యజమాని హత్య

- ల్యాబ్‌లోనే వేటకొడవళ్లతో గుర్తు తెలియని వ్యక్తుల దాడి

సురేశ్(ఫైల్)

నీలగిరి, ఏప్రిల్12 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలర్ ల్యాబ్ యజమానిని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌కు చెందిన గద్దపాటి సురేశ్(37) నల్లగొండ టూటౌన్ స్టేషన్‌కు సమీపంలోని గీతాంజలి అపార్ట్‌మెంట్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లో మడిగను అద్దెకు తీసుకొని ఆరు సంవత్సరాలుగా మణికంఠ కలర్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ల్యాబ్‌లో పని చేస్తున్న వర్కర్లు వెళ్లిపోగా.. షాపు బంద్ చేసేందుకు అందులోని కంప్యూటర్లు, మిషన్స్‌ను సురేశ్ బంద్ చేస్తున్న క్రమంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కష్టమర్ల రూపంలో వచ్చి ఫొటోలు ప్రింట్ వేయాలని అడిగారు. సురేశ్ వారివద్ద నుంచి పెన్‌డ్రైవ్ తీసుకొని మిషన్ వద్దకు వెళ్తుండగా దుండగులు ఒక్కసారిగా అతడిపై వేటకత్తులతో దాడి చేశారు. అతడి గుండెలో పొడిచి, మెడపై నరికారు. దాంతో సురేశ్ అక్కడిక్కడే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, టూటౌన్ ఎస్ఐ యర్రా సైదులు హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం పోస్టుమార్టమ్ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి హత్య కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించి హత్య జరిగిన తీరు, ఆధారాలను సేకరించారు. ల్యాబ్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. సురేశ్ మిర్యాలగూడ, చిట్యాలల్లోని కలర్ ల్యాబ్‌లలో సైతం వాటాదారుడిగా ఉన్నట్లు సమాచారం. దాంతో ఆర్థిక లావాదేవీలు, పాతకక్షలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ నిర్వహిస్తున్నారు. మృతుడి బావమర్ది మబ్బు శివమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసుల ఆదుపులో ముగ్గురు..?

సురేశ్ హత్య కేసును దర్యాప్తు చేపట్టిన పోలీసులు మహిళతోపాటు ముగ్గురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తున్నది. నిందితులు హత్య చేసిన తరువాత రైల్వే స్టేషన్ సమీపంలో బైక్‌ను వదిలి హైదరాబాద్‌కు వెళ్లినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టారు. హైదరాబాద్‌కు వెళ్లి మహిళతో పాటు ఇద్దరు అనుమానితులుచ, నకిరేకల్‌కు చెందిన వ్యక్తిని ఆదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ యూత్ నాయకులు

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ యూత్ నాయకులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శనివారం మండలానికి చెందిన పార్టీ యూత్ నాయకులు హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు పుల్లెంల వెంకట్‌గౌడ్ తన పుట్టినరోజు సందర్భంగా కేటీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయన వెంట పార్టీ కట్టంగూరు మండలాధ్యక్షుడు చెవుగోని సాయి, సోషల్ మీడియా కన్వీనర్ బోయపల్లి సాయికళ్యాణ్, గోలి నర్సింహులు ఉన్నారు.

వెంకటరమణకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందన

వెంకటరమణను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రామగిరి, ఏప్రిల్ 12: ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించిన నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన దాది వెంకటరమణను సీఎం రేవంత్‌రెడ్డి శనివారం అభినందించారు. వెంకటరమణ తన తల్లిదండ్రులు రమాదేవి, శ్రీనివాస్‌రావుతో కలిసి హైదరాబాద్‌లో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం వెంకటరమణకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. వెంకటరమణ కుటుంబ నేపథ్యం గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. వెంకరమణ ప్రస్తుతం జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చర్‌గా పనిచేస్తున్నారు. పట్టుదలతో చదివి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడం అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. వెంకటరమణ వెంట ఇటికాల స్వాతిక్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, వాసుదేవ్, సీనియర్ జర్నలిస్టు ఇటికాల రమణారెడ్డి ఉన్నారు.

మఖానా సాగుతో అధిక లాభాలు

- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనంతరెడ్డి

నారుమడిలో మఖానా విత్తనాలు వెదజల్లుతున్న ఉద్యానవనశాఖ జిల్లా అధికార